## వేములపల్లి స్వర్ణ

# అమూల్య



ఆ బొమ్మ నన్నెంతగా ఆకర్షించిందంటే, ఆ గది వదిలి నేను బయటికి వెళ్ళలేకపోయాను చాలా సేపటి వరకూ. నిలువెత్తు తైలవర్ణ చిత్రం. జోడించిన చేతుల పసిమిఛాయ, ఎడమ చేతి చిటికెనవేలికున్న చిన్న ముత్యపు ఉంగరం, చూస్తున్నకొద్దీ చూడాలనిపిస్తున్నాయి. నిండుగా చీరకట్టుకుని భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తూ ముగ్ధలా నిల్చున్న పాతికేళ్ళ అమ్మాయి బొమ్మ అది. ఆ కళ్ళూ, వాటిలోని మెరుపూ, చూపరులను కదలనివ్వవు. ఆ మొహంలోని జీవకళా, ఆ బుగ్గల్లో లాలిత్యం, ఆ పెదాల ఎరుపూ ... నా జీవితంలో అలాంటి అమ్మాయిని చూసి ఎరగను. క్రమంగా నా ఉనికి ఆవిరిగా మారి, ఆ పటంలోకి నేను కూడా ఇమిడిపోతున్న భావం కలిగింది నాకు. ప్రాణం పోసుకుని ఆ అమ్మాయి గోడ దిగివచ్చి నా ముందు నిల్చున్న అనుభూతి. ఇంకా దగ్గరకు వెళ్ళి చూశాను. ఓ మూల కనపడీ కనపడకుండా రాసి ఉంది 'ప్రసాద్' అని. ఇంకో మూల 'అమూల్య' అని. 'అమూల్య !' ఎంత

చక్కని పేరు. మనసులో పదే పదే అనుకున్నాను. ఎవరీ ప్రసాద్! అప్పటి వరకూ రవివర్మ తప్ప ఇంకొకరు ఆ బొమ్మ వేయగలరని ఊహించని నాకు చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది.

ఉలిక్కిపడ్డాను, మా బాస్ షిండే అరుపు విని.

"వాట్ ది హెల్ ఆర్ యూ డూయింగ్ హియర్. నీకేం చెప్పాను నేను ?"

"అంతా వెతికాం సార్ ! ఎక్కడా ఏమీ కనిపించలేదు" వినయంగా సమాధాన మిచ్చాను.

"కిచెన్‌లో చూశారా ?"

"బాత్‌రూమ్స్ కూడా వదల్లేదు సార్ ! కాంపౌండ్‌లో ప్రతి అంగుళం తవ్వి చూశాం."

"ఇంపాసిబుల్ ! మన కొచ్చిన ఇన్ఫర్మేషన్ ఫాల్స్‌కావటానికి వీల్లేదు." గొణిగాడు షిండే. అప్పటివరకూ ఆయన వెనకే ఉన్న బట్టతల ముసలాయన, ముందుకు వచ్చాడు. ఆయన మొహంచూస్తే ఎవరికైనా గౌరవభావం కలుగుతుంది. కానీ మా బాస్‌కు కలిగినట్టు లేదు.

"ఎక్స్‌క్యూజ్‌మీ సర్ ! ప్రభుత్వం మీకిచ్చిన అధికారాన్ని ప్రశ్నించే హక్కు నాకు లేకపోవచ్చు. మీకొచ్చిన కంప్లైంట్లను ఆధారం చేసుకుని మీ వాళ్లు మా ఫర్నిచర్, శానిటరీవేర్, ఒకటేమిటి, ఖరీదైన ప్రతి వస్తువూ నాశనం చేశారు. నేనిప్పుడు కాంపెన్సేషన్ల గురించి ఆలోచించడంలేదు. ఎందుకంటే ఈ ఇల్లు నా ప్రాణంతో సమానం. అది కాస్తా ధూళిలో కలిసిపోయాక నష్టపరిహారాల ప్రసక్తేలేదు. కానీ నా నిజాయితీమీద మీకు నమ్మకం లేనప్పుడు, దాన్ని తొలగించడానికి నేను దేనికీ వెనుకాడను. అభిమానంకన్నా, ప్రాణం ముఖ్యం కాదు నాకు."

అసహనంగా చూశాడు షిండే. బ్లాక్ మనీ బయటికి తియ్యడంలో అందెవేసిన పెద్ద చెయ్యి. వెళ్ళిన ప్రతిచోటా పది లక్షలైనా పట్టుకోకుండా వదలడని ప్రతీతి. ఈ ఇంట్లో ఏమీ దొరక్కపోవటం ఆయనకు తల తీసేసినట్లుంది. అయినా అంత తేలిగ్గా ఓటమిని అంగీకరించే వ్యక్తి కాదతను.

"నన్ను నమ్మండి" అన్నట్టు చూశాడా ముసలాయన.

'పోనీ నమ్మదామా' అన్నట్టుగా చూశాను నేను మా బాస్‌వైపు.

'మీరుకాదు, మీ బాబులు దిగి వచ్చినా వాళ్లను కూడా నమ్మను' అన్నట్టు మా ఇద్దరివైపు చూశాడు షిండే.

స్మశానంలో రాబందుల్లా తిరిగేస్తున్నారు మా వాళ్ళు కాఫీ సిప్‌చేస్తూ అన్నాడు ఆయన.

"మిస్టర్ షిండే, నా సంగతి తెలిసిన

వారూ, నా గురించి చెప్పగలిగినవారూ ప్రస్తుతం ఈ లోకంలో ఎవ్వరూ లేరు, నేను తప్ప."

నాకు ఆయన వాలకం విచిత్రంగా ఉంది. లక్షల ఖరీదుచేసే ఆ రాజభవనం లాంటి ఇంటిని మా వాళ్ల సర్వనాశనం చేస్తున్నా ఆయన ప్రశాంతంగానే ఉన్నాడు. మా వృత్తిధర్మం నిర్వర్తించేప్పుడు కాళ్లుపట్టుకునే కోటీశ్వరుల దగ్గర్నుండీ, ప్రాణం తీస్తామని బెదిరించే లక్షాధికారులవరకూ ఎంతోమందిని చూశాను నేను. కానీ ఈయన అందుకు భిన్నంగా ఉన్నాడు. తను కూడా మాతోపాటు రైడ్‌కు వచ్చిన పెద్ద మనిషిలా, నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నాడు.

"చిన్నప్పట్నుంచీ, నాతోపాటు పెరుగుతూ వచ్చిన కోరిక ఒక్కటే. ఎవరూ ఊహించని, ఇంతకుముందు ఎవరూ నిర్మించని, ఓ మహత్తర కళాఖండంగా మిగిలిపోయే, అపురూపమైన భవంతి ఒకటి కట్టుకోవాలని, ఎండా వానలనుండి మమ్మల్ని కాపాడలేక పోయిన మా పూరిపాక నా కోరికలకు పునాది. నాకు ఇరవై ఏళ్లొచ్చేసరికి అది ఆల్‌మోస్ట్ నా జీవితాశయం అయిపోయింది. కానీ లక్ష్యంకన్నా మార్గం ముఖ్యం నాకు. విధం చెడ్డ ఫలం నాకక్కర్లేదు. నేను కట్టుకోబోయే ఇంటి విషయంగో కొన్ని నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకున్నాను. ఎంత అందమైనదైనా పవిత్రతలేని ఇల్లు ప్రత్యక్ష నరకంతో సమానం. నేను కట్టబోయే ఇంట్లో ప్రతి ఇటుకముక్కా, ఇసుక రేణువూ, నా కష్టంలోనుండి ఖరీదు కట్టుకోవాలి. నా శ్రమ, నా చెమటకు న్యాయంగా లభించే విలువతోనే ఆ భవంతిని నిర్మించుకుంటాను. ఆ కట్టడంలో అన్యాయాలకు బలైపోయిన అమాయకుల ఆక్రందనలూ, మోసాలకు గురైపోయిన మోడుబ్రతుకుల ఘోషా, వినిపించకూడదు. నేను న్యాయంగా, ధర్మంగా సంపాదించే ప్రతిపైసా ఆ ఇంటిమీద ఖర్చుపెడతాను. ఒకరిని మోసంచేసి సంపాదించిన డబ్బు దాని మీద వెచ్చించి దాన్ని మలినం చెయ్యలేను.

ఈ ఆశయంతో నా కెరీర్ ప్రారంభమైంది. నాకు ఊహ తెలిసేప్పటికే నా వారెవరూ మిగల్లేదు. లోకజ్ఞానం సంపాదించిన తర్వాత, ఒంటరిగా ఉండటమే ఉత్తమం అనుకున్నాను. ఏకాంతంలో ఎన్నో ఏళ్ళు, కేవలం నా కోరికతో మాత్రమే స్నేహంచేస్తూ సంవత్సరాలు గడిపాను." గుక్కతిప్పుకోవటానికి ఆగాడాయన.

పరిశీలనగా చూశాను ఆయన్ని. అప్పటివరకూ ఉన్న గౌరవభావం క్రమంగా నాలో తగ్గిపోతూ వచ్చింది. ఒక స్నేహితుడూ, సన్నిహితుడూ లేని

జీవితానికి అర్థం ఏమిటి ! నీ చుట్టూ నువ్వు గిరిగీసుకుని ఇంకొకర్ని లోపలికి రానివ్వకపోవడం, నీ స్వార్థానికీ, సంకుచిత మనస్తత్వానికీ, అహంకారానికీ నిదర్శనం. అందుకే సాటి మనుషులకు దూరంగా, ఏకాంత ద్వీపాల్లో నివసించే ఇలాంటి ఒంటరి పక్షుల్ని నే నిష్టపడను.

"నా వయసు మూడు పదులు నిండినప్పుడు మూడు వందల్తో చిన్న వ్యాపారం మొదలెట్టాను. క్రమేపీ అది పెరుగుతూ వచ్చింది. దాదాపు పదిహేను సంవత్సరాలపాటు నేను నా ప్రాణం, ధ్యానం అన్నీ దానిమీదే కేంద్రీకరించాను. మధ్యలో ఏర్పడిన ఎన్నో అవాంతరాలను ఒంటరిగా ఎదుర్కొన్నాను. లక్ష్యంమీద చూపుంచినవాడికి మిగతా వేవీ కనిపించవు. అందుకే, వ్యామోహాలూ, వ్యసనాలూ, దర్జాలూ, భోగాలూ నా దగ్గరకైనా రాలేకపోయాయి.

జీవితంలో ఒక దశ అలా నిస్సారంగా గడిచిపోయింది. అందుకు నేనెప్పుడూ పశ్చాత్తాప పడలేదు. నేననుకున్నంత డబ్బు సంపాదించిన తర్వాత, స్థలం కొన్నాను. నేనే స్వయంగా ప్లాన్ వేసుకున్నాను. రెండు సంవత్సరాలపాటు కూలీలలో ఒకడినై వాళ్ళకష్టాన్ని నేనుకూడా అనుభవిస్తూ, ఈ ఇల్లు కట్టుకోగలిగాను. నా అభిరుచులకు అనుగుణంగా, ఎన్నాళ్ళగానో కంటున్న కలలతో ఎంతమాత్రం రాజీకి రాకుండా నా ఊహలకు వాస్తవరూపం ఇచ్చుకోగలిగాను. మీరు అడుగుపెట్టే సరికి ఈ ఇల్లు ఎలా ఉందో మీకు తెలుసు. ఇప్పు డెలా మారిపోయిందో మీరు చూస్తూనే ఉన్నారు." ఒక్క నిమిషం విశ్రాంతి తీసుకున్నా రాయన.

నిజమే. కేవలం ఒక్క మనిషికి రెండంతస్తులూ, పది గదులూ, ఎకరాల కొద్దీ పూలతోటా, ముట్టుకుంటే మాసిపోయేట్టున్న గోడలూ, అద్దాలు లేకపోయినా, ఇబ్బంది పడనక్కర్లేనంత శుభ్రంగా ఉన్న పాలరాతి ఫ్లోరింగ్, మహారాజుల వైభవాన్ని గుర్తుకు తెచ్చే గాజు షాండిలీర్స్, పట్టుమీద నడుస్తున్న అనుభవాన్నిచ్చే తివాసీలూ, కూర్చోగానే తమలోకి లాక్కునే మెత్తని సోఫాలూ, గాలి ఎక్కణ్ణుంచి మోసుకొస్తుందో తెలీని వింత పరిమళాలూ, దాదాపు అన్నీ కేవలం ఆ ఒక్క రేపో మాపో రాలిపోయే వ్యక్తికే అంకితం అన్న ఈర్ష్య మినహాయిస్తే, నా కా ఇల్లు ఎంతో బాగుంది.

బొంబేలో ఓ పెద్ద బట్టలమిల్లు యజమాని ఆయన. ఇతరత్రా పార్ట్‌నర్స్ ఎవరూ లేరు. ఒంటరిగాడు. పెళ్ళాం, బిడ్డలు కూడా లేరు. మా లెక్కల ప్రకారం అతనిదగ్గర కనీసం పదిహేను లక్షలైనా బ్లాక్‌మనీ ఉండాలి. కానీ

ఎకౌంట్సు అన్నీ చాలా పకడ్బందీగా ఉన్నాయి. ఎక్కడా వేలెత్తి చూప డానికి వీల్లేదు. గవర్నమెంటుకు రెగ్యులర్‌గా టాక్సు కట్టేవాళ్ళలో ఆయ నొకడు.

"చూసేవాళ్ళకు నా ఇల్లూ, మిల్లూ రెండే కనబడతాయి. ఈ ఇంటిమీద నేను పెట్టిన ఖర్చూ, ఈ మధ్య నా బట్టల మిల్లులో నాకు వచ్చిన నష్టాలూ, ఎవరికీ అక్కర్లేదు. నిజానికి ఈ ఇల్లు తయారైన తర్వాత నేను వ్యాపారాన్ని అంతగా పట్టించుకోలేదు. అసలు నే నీ గడపదాటిందే చాలా తక్కువ. తత్ఫలితంగా విపరీతమైన నష్టానికి గురయ్యాను నేను. అయినా పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే నా లక్ష్యం నెరవేరింది కాబట్టి. ఈ రోజున మీరు దాన్ని కూలగొట్టారు. ఫర్వాలేదు. నేనెంత క్షోభనైనా నాలోనే దిగమింగు కుంటాను. పౌరుడిగా ప్రభుత్వంపట్ల నాకున్న బాధ్యతలు నాకు తెలుసు. అందుకే మీకు అడ్డు చెప్పటంలేదు. మళ్ళీ ఒకటి రెండు సంవత్సరాలు నేను వ్యాపారంమీద దృష్టిని కేంద్రీకరిస్తే మీరు చెదరగొట్టిన నా కలలన్నీ మళ్ళీ రూపు దిద్దుకుంటాయి."

షిండేవైపు చూశాను. దీర్ఘంగా ఆలోచిస్తున్నా డతను. ఆత్మాహుతి చేసుకుంటూ కూడా ఆ సిగరెట్ అతనికి ఆనందాన్ని ఇవ్వలేకపోతోంది. అతని చూపు చాలాసేపు ఒకేచోట కేంద్రీ కృతమై ఉంది. ఇందాక నేను చూసిన బొమ్మనే అతనూ చూస్తున్నాడు తదేకంగా. షిండేకు కళలమీదా, సాహిత్యం మీదా అభిరుచిలేదన్న సంగతి నాకు తెలుసు. ఆ బొమ్మలో రంగులుతప్ప అతని కళ్ళకు ఇంకేమైనా కనపడతాయని నేననుకోను. మరి... అతనలా ఎందుకు చూస్తున్నట్టు ... అంతే. మరునిమిషం నా గుండె జల్లు మంది. రాక్షసుడి భావాలు, రాక్షసుడికే తెలుస్తాయి. అతని ఆలోచనలు అర్థ మౌతున్నకొద్దీ, నాకు మతిపోతోంది.

"నా జీవితంలో ఆప్తు లెవరైనా ఉంటే ఆ అమ్మాయే" ముసలాయన మెల్లగా అన్నాడు.

ఆ గొంతులో అప్పటివరకూ లేని సౌమ్యత, ఆప్యాయత చోటు చేసు కున్నాయి.

"మీ కేమౌతా రామె ?" అడిగాను నేను.

"నాకా ! ఆమె మనిషైతే కదా ఏమైనా అయ్యేందుకు."

నేను అర్థంకానట్టు చూశాను.

"అది కేవలం ఊహాచిత్రంమాత్రమే. ప్రసాద్ అనే కుర్రవాడు దిక్కులేక కొన్నాళ్ళు నన్నాశ్రయించాడు. అతను చిత్రించా డా పటాన్ని. దాదాపు ఆరు నెలలు పట్టింది. అతని కృషికి ఫలితంగా ఎనభై వేలిచ్చాను. ఇప్పుడతను

ఇటలీలో ఏదో మ్యూజియంలో పని చేస్తున్నా దనుకుంటాను."

"చాలా బావుంది" అన్నాను నేను.

తన అభిరుచిని మెచ్చుకున్నందుకు కృతజ్ఞతలాంటి చూపొకటి చూశా డాయన నావైపు.

షిండే ఆ బొమ్మవైపు నడిచాడు. ఆ బొమ్మను అటూ ఇటూ కదిలించ బోయాడు. కదల్లేదది. బాగా మందంగా ఉందా ఫ్రేమ్. చేత్తో తట్టి చూశాడు. లోపల బోలుగా ధ్వనించింది. నావైపు చూశాడు. ఆ చూపుల అర్థం నాకు తెలుసు సన్నని వణుకు పట్టుకుంది, నాకు. ముద్దాయికి ఉరిశిక్ష అమలు జరపమని తను తలారికి అధికారి ఇచ్చే ఆజ్ఞ అది. నా చేతులు, నా మాట విననంటున్నాయి.

ముసలాయన ముందుకు వచ్చాడు. ఆయన కళ్ళల్లో అనిర్వచనీయమైన ఆరాధన.

"స్త్రీ అంటే ఏమిటో నాకు తెలీ దింతవరకూ ! ప్రేమ, అనురాగాలకు నోచుకోలేదు. జీవితమంతా మోడులా పేలవంగా, నిరాసక్తంగా గడిచి పోతున్న రోజుల్లో ఈ బొమ్మ నా బ్రతుకులో అడుగుపెట్టింది. అమూల్యా దాని పేరు. అది నాకు అందించే భావాలు కూడా అమూల్యమైనవే. ఇప్పుడు నా ఊపిరిలో ఒక భాగమది. నా వ్యక్తి త్వానికి, నా ఉనికికి ప్రేరణ అది. ఈ లోకంలో ఏది లేకపోయినా బతగ్గలను గానీ ఆ బొమ్మను చూడకుండా బ్రతక లేను." చేత్తో ఒకసారి ఆ పటాన్ని ప్రేమగా తడిమా డాయన.

"కిషన్" పిలిచాడు షిండే. ఆ పిలుపులో మార్దవంలేదు.


"బ్రింగ్ యువర్ ఆపరేటస్" యుద్ధానికి సిద్ధంకమ్మని మేజర్ ఇచ్చే ఆజ్ఞ అది.

తలెత్తి ఓసారి ఆ బొమ్మవైపు చూశాను. ఆ కళ్ళల్లో వెలుగు నన్ను కాల్చేస్తోంది. ఈ ప్రపంచంలో అరుదై పోతున్న మానవత్వాన్ని, ప్రేమను మీకు అందిస్తాను అని వాగ్దానం చేస్తున్న ట్టున్న ఆ బొమ్మముందు, వణుకుతున్న రాముడిలా ముసలాయన, సీతాదేవిని చెరచబోతున్న రావణుడిలా షిండే, కర్మకాండను నిర్వహించేకర్తల్లా మా కింకరులూ, పిరికితనం రక్తంగా మారి పోయిన నేనూ నిలబడ్డాం.

"కమాన్ ! బేర్ దట్" గర్జించాడు షిండే, బొమ్మల్లా నిలబడిపోయిన మమ్మల్ని

మరునిమిషం ముసలాయన షిండే రెండుచేతులూ పట్టుకున్నాడు. అంతు లేని బాధ అతని మొహంలో కనిపిస్తోంది.

"సర్ ! మీ కాళ్ళు పట్టుకుంటాను. కావాలంటే ఈ బిల్డింగ్‌లోని ప్రతి అణువూ తవ్వి పారెయ్యండి. నాకున్న



యావదాస్తీ తీసేసుకోండి. కానీ ఆ బొమ్మనేం చెయ్యకండి. నా ప్రాణం అది. నా ఉనికి, నా ఊపిరి అది. దాన్ని చూడకుండా క్షణంకూడా బ్రతకలేను. దాని కేమైనాఅయితే నేను బ్రతకలేను." దాదాపు ఏడ్చేస్తున్నాడాయన.

నా గుండె నీరైంది. రెండు నిమిషాలు ఆ బొమ్మముందు నిలబడితేనే అపూర్వమైన ఆనందాన్ని, అనుభవాన్ని నా కందించ గలిగిందది. అలాంటప్పుడు ఎన్నో ఏళ్ళగా అనుబంధాన్ని పెంచుకున్న ఆయన గుండె చెదిరేలా విలపించడంలో నాకు అసహజత కనిపించలేదు.

షిండే ముసలాయనను పక్కకు తీసుకెళ్ళాడు బలవంతంగా.

"ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్! సెంటిమెట్లకు, ఫీలింగ్స్‌కు మేం

అతీతులం. మా డ్యూటీ మేం చెయ్యాలి! నిమిత్తమాత్రులం. ఈ విషయంలో నేనేం చెయ్యలేను. క్షమించండి !"

"కావలిస్తే ముందు నన్ను చంపి తర్వాత ఆ బొమ్మను చింపండి. ఆ బొమ్మలోపల ఏంలేదు. అంతా శూన్యమే. నా ఇంటి ప్రాంగణాన్నే ఎంతో పవిత్రంగా చూసుకునే నేను, నా ప్రాణంలో ప్రాణమైన ఆ బొమ్మను, నా మోసానికీ, అవినీతికీ నిలయంగా వాడుకుంటానా ! ఆమాత్రం ఇంగితంలేదా మీకు. ఆలోచించలేరా ! మనుషులేనా మీరసలు !" తల గోడకేసి కొట్టుకుంటున్నాడాయన.

కిషన్, బలరాం, సింగ్, మూర్తి పరికరాలు చేతుల్లోకి తీసుకున్నారు, అందమైన లేగ దూడను చంపడానికి కత్తులెత్తిన హంతకుల్లా. ఐదునిమిషాలు నా గుండె స్థభించింది. పిచ్చిపట్టినట్టు ముక్క ముక్కనూ పట్టి చూస్తున్న షిండే కళ్లు నిరాశగా వాలిపోయాయి. ఆ తైలవర్ణ చిత్రపు శిధిలాల్లో మాక్కావలసిందేదీ కనిపించలేదు.

నుదుట పట్టిన చెమటను అద్దుకుంటూ సోఫాలో కూర్చోబోతున్న మా బాస్, ముక్కలైన మనసును తిరిగి సరిచేసుకునే ప్రయత్నంలో ఉన్న నేనూ, చింపి పోగులు పెట్టిన ఆ అందమైన అతివ అవయవాలను ఏరుకుంటున్న మా వాళ్ళూ, అందరం ఉలిక్కిపడ్డాం ఒకేసారి.

మా కళ్ళముందే ఆ ముసలాయన మొదలు నరికిన చెట్టులా కూలి పోయాడు. ఒక్క అంగలో ముందుకు ఉరికి ఆయన చెయ్యి నా చేతిలోకి తీసుకున్నాను. అప్పటికే అంతా అయిపోయింది. తీవ్రమైన అశాంతి మొహంలో నింపుకుని, అంతులేని క్షోభ హృదయాన్ని దహిస్తుంటే, అంతిమ శ్వాసతీసుకున్న దీర్ఘరోగిలా ఉన్నాడాయన. నాకు రెండు నిమిషాలు లోకంతో సంబంధం తెగిపోయింది. నేను మళ్ళీ తెలివి తెచ్చుకునేసరికి, నా చేతిలో ఓ కాగితం పెట్టి, "ఆఫీస్‌లో ఇచ్చెయ్" అన్నాడు షిండే వేగంగా బయటకు నడుస్తూ.

తెరిచి చూశాను. అది అతని రాజీనామా.

గుండెను తీసి ఆ స్థానంలో శూన్యాన్ని నింపుకుని ఫోన్‌వైపు నడిచాను.

———